సాక్షి
చిత్తూరు
శనివారం ! 11 ! మే ! 2024



పుత్తూరులో జరిగిన సభకు పోటెత్తిన అభిమానులు (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే.రోజా, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



మండే ఎండను మనసులోని అభిమానం అధిగమించింది.. ఉప్పొంగే ఉత్సాహం నడుమ వేసవి తీవ్రత చిన్నబోయింది.. జయహో జగన్ నినాదాలతో పుత్తూరు మార్మోగింది.. ఎన్నికల ప్రచారంలో భాగంగా విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అశేష జనసందోహం తరలివచ్చింది.. సంక్షేమ సారథి ప్రసంగానికి కరతాళధ్వనులతో సంపూర్ణ మద్దతు తెలిపింది.. ప్రజాప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపునిస్తే.. ఫ్యాను గుర్తుకే ఓటే స్తామని ముక్తకంఠంతో బదులిచ్చింది. నవరత్న పథకాలు అందాయా అని ప్రశ్నిస్తే.. అందాయన్నా.. అంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. కూటమి కుట్రలను ఎండగడితే.. మీ వెంటే మేముంటాం అంటూ నినదించింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను విజయీభవ అంటూ ఆశీర్వదించింది.

విజయీభవ

- సీఎం వైఎస్ జగన్ సభకు పోటెత్తిన ప్రజానీకం
- ముఖ్యమంత్రి ప్రసంగానికి ఆద్యంతం స్పందన అద్భుతం
- మండుటెండలోనూ స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనసందోహం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప,రోజా గెలుపు తథ్యమంటున్న జనం

సాక్షి, చిత్తూరు/నగరి : ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం నగరి నియోజకవర్గం పుత్తూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. సభకు వేలాదిమంది స్వచ్ఛందంగా తరలివచ్చారు. పట్టణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రజలను ఆలోచింపజేసింది.

హోరెత్తిన జగన్నినాదం

ముఖ్యమంత్రి సభలో జై జగన్ నినాదం హోరెత్తింది. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజానీకం కేరింతలు కొట్టింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా, సొంత జిల్లాకు సైతం ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. ఆయన పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించారు. 2014 మేనిఫెస్టోలో ప్రకటించిన ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు మళ్లీ సూపర్ సిక్స్ పేరుతో మోసం చేసేందుకు వస్తున్నారని హెచ్చరించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశామని, పేదలందరికీ పక్కాగా సంక్షేమ పథకాలు అందించామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, చంద్రబాబుకు ఓటేస్తే అన్ని పథకాలు ముగింపు పలుకుతారని వివరించారు.



అడుగడుగో జగన్ మామ!

జగనన్న మొనగాడు.. చంద్రబాబు మోసగాడు

ఎన్నికల బరిలో సింగిల్‌గా దిగిన జగనన్న మొనగాడని, ఓట్ల కోసం నానా గడ్డి కరిచే చంద్రబాబు మోసగాడని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభలో ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జగనన్నను ఢీకొట్టే దమ్ము లేకే చంద్రబాబు ఢిల్లీ నుంచి మోదీని, హైదరాబాద్ నుంచి పవన్ కల్యాణ్‌ను, పక్కరాష్ట్రాల నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డిని, బీజేపీ నుంచి వదినమ్మను, కాంగ్రెస్ నుంచి చెల్లెమ్మను, అలాగే రామోజీని, రాధాకృష్ణను, మందకృష్ణను, నిమ్మగడ్డ రమేష్‌ను తీసుకువచ్చారని విమర్శించారు. అటు వైపు ఎందరు వస్తున్నా ఈ వైపు వార్ వన్ సైడ్ అంటూ జగనన్న నిజాయితీగా నిలబడ్డారన్నారు. ఆయన వెంట జనం సైనికుల్లా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు వస్తే చంద్రబాబుకు అబద్ధాలు తన్నుకు వస్తాయన్నారు. 2014లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి సూపర్ సిక్స్ అంటూ వచ్చారని, దాన్ని కూడా వదిలేసి ఇప్పుడు కొత్త మేనిఫెస్టో అంటున్నారని ఎద్దేవా చేశారు. 13వ తేదీన పోలింగ్ బూత్‌లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై బటన్‌ను నొక్కాలని పిలుపునిచ్చారు.

కన్నతల్లే ఛీకొట్టిన కొడుకు భానుప్రకాష్

కన్నతండ్రి ముద్దుకృష్ణమ నాయుడును భానుప్రకాష్ చంపాడని అతని తల్లి, తమ్ముడు చెబుతున్నారని వెల్లడించారు. చివరకు కన్న తల్లే ఛీకొట్టిన కుమారరత్నం భానుప్రకాష్ అన్నారు. కన్న తల్లి మన్ననలు పొందలేని కొడుకు ప్రజల మన్ననలు ఎలా పొందగలడని ప్రశ్నించారు. నగరిలో ఒక మహిళ అయిన తనను ఎదిరించలేక గుంపులుగా వస్తున్నారని మండిపడ్డారు. జగనన్న ఇచ్చిన పదవులు అనుభవించి ఆయనకే వెన్నుపోటు పొడిచిన గుంపును కూడా కలుపుకున్నారన్నారు. ఈ గుంపులకు ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. తన వెంట ప్రజలకు సేవచేసే ప్రజాప్రతినిధులుంటే, భానుప్రకాష్ వెంట గంజాయి స్మగ్లర్లు, పీడీ యాక్ట్‌లో ఉన్న వారు, ఎర్రచందనం స్మగ్లర్లు, ఇసుక స్మగ్లర్లు, హత్యాయత్నం చేసి జైలుకు వెళ్లి వచ్చినవారే ఉన్నారని వివరించారు. ఎవరికి ఓటు వేస్తే నగరి అభివృద్ధి జరుగుతుందో ఆలోచించాలని సూచించారు. ఇంటికి వెళ్లగానే ఫ్యాన్ బటన్ నొక్కితే చల్లని గాలి వస్తుంది, పోలింగ్ బూత్‌కు వెళ్లి ఫ్యాన్ గుర్తున్న బటన్ నొక్కితే చల్లని పాలన వస్తుందని స్పష్టం చేశారు.



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్కే రోజా

టీడీపీలో గుబులు

ముఖ్యమంత్రి రాకతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఈ క్రమంలోనే టీడీపీలో గుబులు మొదలైంది. సీఎం సభకు పెద్దసంఖ్యలో జనం స్వచ్ఛందంగా తరలిరావడంతో పచ్చనేతల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి వారిలో అంతర్మథనం ప్రారంభమైంది. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం ఎన్నికలకు ముందే ఖరారైనట్లు పట్టణవాసులు చర్చించుకోవడం కనిపించింది.



ఉప్పొంగిన ఉత్సాహం



దండాలయ్యా..మాతోనే నువ్వుండాలయ్యా!



మేనమామ కోసం..



జై జగన్



మనవడిని చూశా.. చాలు!



ఈల వేసి.. ప్రత్యేకతను చాటి!



అభిమాన నేత రాక కోసం మండుటెండలో ఎదురు చూస్తూ..



మా నమ్మకం నువ్వే జగనన్నా : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో చేతులూపి ఉత్సాహంతో కేరితలు కొడుతున్న ప్రజలు



నీరాజనం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టంగా భద్రత



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు సమీపంలోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్, ఈవీఎం యంత్రాల భద్రత ఏర్పాట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్, ఈవీఎంలు భద్రపరిచే గదుల వద్ద మూడంచెల భద్రత ఉండాలన్నారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

14 వరకు 144 సెక్షన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 11వ తేదీ రాత్రి 7 నుంచి 14 వ తేదీ రాత్రి 7 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ 144 సెక్షన్ కారణంగా ఐదుగురు కంటే ఎక్కువ మంది ఒకేచోట ఉండకూడదన్నారు. గుంపులుగా వెళ్లేందుకు వీల్లేదని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద లౌడ్ స్పీకర్లు వినియోగించకూడదని స్పష్టం చేశారు.

వరసిద్ధుని హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మొత్తం 21 రోజులకు గాను స్వామివారికి మొత్తం రూ.1,14,63904లు ఆదాయం వచ్చినట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. నగదుతోపాటు 73 గ్రాముల బంగారం, 1.320 కిలోల వెండి వచ్చినట్లు వెల్లడించారు. ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ్య, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



■ పెనుమూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఈమె పేరు పి.ఇందుమతి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈమెకు వికలాంగురాలి పింఛను మంజూరైంది. అయితే 2014లో చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీ వారు ఈమెకు వస్తున్న పింఛన్‌ను ఉద్దేశపూర్వకంగా తొలగించారు. దీంతో బాధితురాలు పలుమార్లు పింఛన్ కోసం అధికారుల చుట్టూ, జన్మభూమి కమిటీ చుట్టూ ప్రదక్షిణ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రభుత్వంలో వలంటీరు నేరుగా ఇందుమతి ఇంటికే వెళ్లి దరఖాస్తు తీసుకున్నారు. వెంటనే పింఛన్ మంజూరు చేయించి ఆదుకున్నారు.



■ కార్వేటినగరం మండలం సురేంద్ర నగరానికి చెందిన ఇతని పేరు పద్మనాభశెట్టి. ప్రధాన ఆధారం వ్యవసాయం. అయితే పంటల సాగుకు ప్రభుత్వ రాయితీపై ట్రాక్టర్ కోసం 2015లో అధికారులకు వినతి చేసుకున్నారు. అయితే జన్మభూమి కమిటీ వారు ఆమోదిస్తేనే ట్రాక్టర్‌ను మంజూరు చేస్తామని అధికారులు తేల్చిచెప్పేశారు. దీంతో పలుమార్లు జన్మభూమి కమిటీ చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రైతు మిత్ర సంఘంలో సభ్యుడుగా చేరి రాయితీపై అందించే ట్రాక్టర్, యంత్రపరికరాలను పొందాడు. సకాలంలో పంటల సాగుకు ఉపయోగించుకుని మంచి దిగుబడిని సాధిస్తున్నాడు.



■ చిత్తూరు మండలం తాళంబేడు గ్రామానికి చెందిన ఇతని పేరు గోవిందరెడ్డి. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ వారు అయనకు వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను నిలిపివేశారు. టీడీపీ సానుభూతి పరుడు కాదని మళ్లీ పింఛన్ రాకుండా అడ్డుకున్నారు. దీనిపై గోవిందరెడ్డి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి విసిగి వేసారిపోయాడు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్ సహకారంతో పింఛను మంజూరైంది. ప్రతి నెలా రూ.3వేలు అందుకుంటున్నాడు. తన అవసరాలకు సంతోషంగా వినియోగించుకుంటున్నాడు.

అరాచకశక్తులకు జన్మభూమి



ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలి. ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వాల లక్ష్యం కావాలి. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చాలి. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి. ఎప్పటికప్పుడు సంక్షేమ ఫలాలను పేదలకు చేరవేయడంలో బాధ్యతగా వ్యవహరించాలి. అయితే చంద్రబాబు హయాంలో ఇవేమీ నడిచేవి కావు. పూట గడవని వారికి సైతం సర్కారు సాయం అందేది కాదు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీల చేతిలోనే గుత్తాధిపత్యం ఉండేది. వారు చేయి తడపందే ఏ పనీ చేసేవారు కాదు. తమ పార్టీ వారికి తప్ప నిరుపేదలను కూడా పట్టించుకునేవారు కాదు. ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచుకునేవారు. అభివృద్ధిని తమ వరకే పరిమితం చేసుకునేవారు. అరాచకశక్తులుగా తయారై జనం రక్తం పీల్చేసేవారు. లంచాల కోసం ప్రజలను వేధించేవారు. దీంతో జన్మభూమి కమిటీ పేరు చెబితేనే జనం వణికిపోతున్నారు. బాబుకు అవకాశమిస్తే కొండ చిలువ నోటికి చిక్కినట్టే అని బెంబేలెత్తుతున్నారు. అవినీతి పరుల చేతిలో ఆయువు మూడినట్టే అని ఆందోళన చెందుతున్నారు. – చిత్తూరు అగ్రికల్చర్

- పేదల కడుపుకొట్టి దోపిడీ
- స్వపక్షానికే సంక్షేమ పథకాలు
- నిజమైన అర్హులపై వివక్ష
- పైసా పడందే పని జరగని పరిస్థితి
- జన్మభూమి కమిటీల నిరంకుశత్వంపై వెల్లువెత్తిన వ్యతిరేకత
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థకే ప్రజల మద్దతు

నిలువుదోపిడి తప్పదు



గతంలో జన్మభూమి కమిటీల పేరుతో నిరుపేదలను నిలువుదోపిడీ చేశారు. ఏ చిన్న పని చేసుకోవాలన్నా ముందు జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇచ్చి ప్రసన్నం చేసుకోవాల్సిందే. లేదంటే అధికారుల వద్ద ఎలాంటి పనులు జరిగేవి కావు. మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తే బడుగు బలహీన వర్గాలు జీవనం కష్టతరంగా మారుతుంది. అందుకే చంద్రబాబు నమ్మాలంటే భయమేస్తోంది.

– జబ్బారయ్య, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

మభ్యపెట్టే ప్రయత్నం



ఈసారి ఎలాగైనా గద్దెనెక్కాలనే ఉద్దేశంతో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ఎవరికీ న్యాయం జరగకపోగా, ప్రతి గ్రామంలో అరాచక పాలనతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఆయన హయాంలో చేసింది.. చెప్పుకోదగింది ఏమీ లేదు. మళ్లీ ఎన్నికల నాటకాలతో ప్రలోభాలకు గురిచేస్తున్నారు.

– కె.శంకర్‌రెడ్డి, బండకింద పల్లె, రొంపిచెర్ల మండలం

సంక్షేమానికే మళ్లీ పట్టం



ఎన్నికల్లో అలవి కాని హామీలిచ్చి ప్రలోభాలకు గురిచేసే చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. జన్మభూమి కమిటీలతో ప్రతి గ్రామంలో బడుగు బలహీన వర్గాలపై దౌర్జన్య కాండ చేశారు. అర్హులకు ఎలాంటి పథకాలు ఇవ్వకుండా అడ్డుకోవడమే కాకుండా ప్రజలను నిలువునా దోచుకున్నారు. సంక్షేమానికి పెద్దపీట వేసి, ప్రజలను ఆదుకునే నాయకుడి వెంటే ఉంటాం. సంక్షేమానికే మళ్లీ పట్టం కడతాం.

– మురళి, గుంటిపల్లె, పెనుమూరు మండలం

కుర్చీ కోసమే బాబు ఆరాటం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : చంద్రబాబు ఆరాటం కేవలం సీఎం కుర్చీ కోసమే అని, ప్రజల కోసం కాదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్కేవీబీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని చంద్రబాబు కుతంత్రాలకు తెరతీశారని ఆరోపించారు. బాబుకు ఓటేస్తే రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఏం చేస్తామో చెప్పుకోవాల్సింది పోయి, హింసకు ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మంచి జరిగితే బాబుకు గిట్టదని, ఎదిరించిన వారిపై దాడులు చేయించడమే ఆయన నైజమని స్పష్టం చేశారు. పేదల సొమ్మును పెత్తందార్లకు దోచిపెట్టేందుకు ఉబలాటపడుతున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇదేవిధంగా సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీ ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో చంద్రబాబుకు అన్ని సామాజికవర్గాలు కావాలని, ఎన్నికల తర్వాత కేవలం కమ్మవారికే పదవులు కట్టబెడతారని విమర్శించారు. జగనన్నను ఎదుర్కొనే దమ్ము లేకే ఆయన కూటమి కట్టి పోటీ చేస్తున్నారని, అయితే ప్రజల మద్దతుతో ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, సర్పంచ్ దివ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకనాథరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, బండి జగదీష్‌రెడ్డి, ధనంజయరెడ్డి, గోపి, సాయి, గిరి, సుబ్రమణ్యం, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప

గుడిపాల : మండలానికి చెందిన ఐటీ ఉద్యోగులతో శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విజయవాడ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేసేందుకు గుడిపాలకు వచ్చారు. ఈ సందర్భంగా వారితో సమావేశమైన అభ్యర్థులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికీ అందించారని, అందుకే మంచి జరిగుంటేనే ఓటేయమని అడిగారని వెల్లడించారు. దీనిపై ఐటీ ఉద్యోగులు స్పందిస్తూ జగనన్న పాలనను జనం మెచ్చారని, ఈ క్రమంలోనే తాము సైతం ముమ్మర ప్రచారంలో భాగస్వాములవుతున్నట్లు వివరించారు. మండలంలో వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీ తీసుకువచ్చేందుక కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్ రాయల్, రజనీకాంత్, ప్రతాప్‌రెడ్డి, కలైఅరసి, వెంకటేశులురెడ్డి, జయకోడి పాల్గొన్నారు.

పారదర్శకంగా పోలింగ్ ప్రక్రియ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి అయిందన్నారు. 17,741 మంది ఉద్యోగులు ఓటేసినట్లు వెల్లడించారు. అలాగే ఓటర్లకు 97 శాతం స్లిప్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఓటర్ స్లిప్పులు రాకపోతే ఈసీఐ స్పేస్ ఎపిక్ కార్డ్ నంబర్‌ను టైప్ చేసి 1950 నంబర్‌కు ఎస్ఎంఎస్ చేస్తే స్లిప్పు వస్తుందని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ఈ నెల 12వ తేదీన ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల వారీగా పంపడం జరుగుతుందని తెలిపారు. తర్వాత సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళతారని చెప్పారు. 13వ తేదీన ఉదయం 5 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 5.30 గంటల కు మాక్‌పోల్ నిర్వహణ, ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ మొదలవుతుందని వెల్లడించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగుస్తుందని తెలిపారు.

పెద్దాయనకు అత్యధిక మెజారిటీ తథ్యం



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి

సదుం : ఉమ్మడి జిల్లాకు పెద్దాయన, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యధిక మెజారిటీ వస్తుందని మండలంలోని ఊటుపల్లె సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఊటుపల్లె, పుట్టావారిపల్లె, బొమ్మిరెడ్డిగారిపల్లె, మద్దినవారిపల్లె, మర్రిమాకులపల్లె, దళితవాడ, చల్లావారిపల్లెలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికే ఆదర్శంగా పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగనన్న సంక్షేమం కొనసాగాలన్నా, పుంగనూరులో మరింత అభివృద్ధి జరగాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు

పోలింగ్ కౌంట్ డౌన్ ప్రారంభం

– నేటితో ఎన్నికల ప్రచారానికి ముగింపు



చిత్తూరు పీసీఆర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరింది. విమర్శలు, ప్రతి విమర్శలకు తోడు వెల్లువలా హామీలు గుప్పిస్తూ అభ్యర్థులు చేస్తున్న ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. మిగిలిన కొద్ది సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఎన్నికల అధికారులు పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు పూర్తి చేశారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి



వెంకటముని (ఫైల్)

చౌడేపల్లె : మండలంలోని పాదలపల్లెకు చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వి.వెంకటముని (49) ప్రస్తుతం ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోని గడ్డి లోడ్ తీసుకుని అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం వెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా నిమ్మనపల్లె మండలం చింతపర్తివారిపల్లె స్కూల్ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటముని అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



మైనారిటీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పార్టీలో చేరిన ముస్లిం నేతలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఈ మేరకు పలమనేరుకు చెందని మైనారిటీ నేతలు ఇంతియాజ్, ఖాదర్, ఎస్ఆర్‌బాబు, ముసలీన్, జాఫర్, ఖదీర్, అక్బర్, చందు, జిల్లా హ్యూమన్ రైట్స్ సంస్థ నేత ముబారక్ తదితరులు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు సుభాష్ చంద్రబోష్, మండీ సుధా, శ్యామ్, నాగరాజు, మూర్తి, శ్యామ్‌సుందర్‌రాజు, భరత్, ఫైరోజ్, హైదర్, నవీన్,సేటు, కమాల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని తోటకనుమ పంచాయతీ మోర్థపల్లెకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నేత కిషోర్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ఆకర్షితులై..

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక నేత పూజారి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు కిరణ్‌రాయల్‌తో పాటు మరో 40మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, సింగిల్ విండో చైర్మన్ ధనచంద్రారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, నేతలు భానుప్రకాష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, నాగరాజా, విజయ్‌కుమార్‌రెడ్డి, హారూన్, శేఖర్, మురళి, రంగారెడ్డి, సురేంద్రయాదవ్, హరీష్‌రెడ్డి, భానప్రకాష్, రమణ పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ




పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో మే 14(మంగళవారం) నుంచి 30 రోజుల మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి, తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం , రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీ ణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలన్నారు.

థామస్.. నేరాలకు బాస్!

- మోసం చేయడంలో తనకుతానే సాటి
- పలు కేసుల్లో నిందితుడిగా నమోదు
- యథేచ్ఛగా ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ఘనుడు



వీఎం థామస్ (ఫైల్)



థామస్ బాధితులు రాసిన ఉత్తరం

కార్వేటినగరం : ప్రజలను తప్పుదోవ పట్టించి మోసం చేయడంలో తనకు తానే సాటి అన్నట్టు జీడీ నెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ వ్యవహరిస్తున్నారు. పలు కేసులో నిందితుడిగా పోలీసు రికార్డుల్లోకి ఎక్కారు. వైద్యం కోసం వచ్చిన వారిని నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆడబిడ్డల పిండాలతో వ్యాపారం చేస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. చదివించి టెక్నీషియన్ కోర్సు అయినప్పటికీ డాక్టర్ అవతారమెత్తి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఐవీఎఫ్ సృష్టికర్త నేనేనంటూ మోసాలు

ఐవీఎఫ్ విధానం తానే కనిపెట్టానంటూ థామస్ అసత్యాలు వల్లిస్తున్నారు. ప్రజలను తప్పుదారి పట్టిస్తూ సంతానం లేని వారికి టెస్ట్‌ట్యూబ్ బేబీలు పుట్టేలా చేస్తానంటూ రూ.లక్షలు గుంజుతున్నారు. వాస్తవానికి థామస్ డాక్టర్ కాదు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్ పరిశీలిస్తే అర్థమవుతుంది. అందులో డాక్టర్ అని ఎక్కడా పేర్కొనలేదని అధికారులు వెల్లడించారు.

బయటపడ్డ థామస్ నేరచరిత్ర

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నామినేషన్‌తోపాటు థామస్ సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన నేరచరిత్ర మొత్తం ఉంది. చెన్నై సెంబియం పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసుతో పాటు నేరపూరిత బెదిరింపు కేసులు ఉన్నాయి.2018లో చెన్నై ఆరుబాంకం పోలీస్‌స్టేషన్‌లో దౌర్జన్యానికి పాల్పడిన కేసు, 2019లో తిరుపతి ఈస్టు పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 420 కేసు నమోదైంది. ఆడబిడ్డల పిండాలతో ఆడుకుంటున్న మోసకారి అని గతంలో చెన్నైలో థామస్‌కు చెందిన కొన్ని వీడియోలు, ఉత్తరాలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి క్రిమినల్ చరిత్ర ఉన్నవారిని ఎన్నుకుంటే భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని జీడీ నెల్లూరు నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటూ ఉండడం గమనార్హం.